క్లుప్తంగా

నేడు ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం ఆలయ ప్రాంగణంలో జరగనుందని ఈవో రావూరి వెంకటేశ్వరరావు తెలిపారు. పాలక మండలి చైర్మన్‌గా ఆలయ ఫౌండర్ నందిపాటి శ్రీనివాసరావు, సభ్యులుగా చలమలశెట్టి జగదీష్, ఎ.మాణిక్యాలరావు, పోతిన గాయత్రి, భవానీ, పి.తులసి, గుర్రం బేబీ స్వప్నలు బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రమాణస్వీకారానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో పేర్కొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని కొత్తపేట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ దేవసుధ గురువారం తెల్లవారుజామున గస్తీ నిర్వహిస్తుండగా, షేక్ రాజా హాస్పటల్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని విచారించగా, కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లోని సుధా బార్‌లో పని చేసే చల్లా దుర్గారావుగా గుర్తించారు. నిందితుడి వద్ద లభించిన చేతి సంచిలో 5 బీర్ బాటిల్స్‌తో పాటు మూడు క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసు అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



విజయవాడస్పోర్ట్స్: సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు సేవలందించి గురువారం ఉద్యోగ విరమణ పొందిన సూర్యారావుపేట ఎస్‌ఐ ఎస్.శ్యామలరాజు, సీఏఆర్ ఎస్‌ఐ బి.జాన్‌సుభాకరరావులకు అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ టి.కనకరాజు ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇద్దరు అధికారులను శాలువాలతో ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఏఆర్ ఏసీపీ డి.ప్రసాదరావు, కార్యాలయ ఏవో రంగారావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమయ్య పాల్గొన్నారు.

రెండో అదనపు జిల్లా కోర్టు ఎన్డీపీఎస్ స్పెషల్ పీపీగా క్రిస్టోఫర్



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ రెండో అదనపు జిల్లా కోర్టు నార్కోటిక్ డ్రగ్స్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్డీపీఎస్) ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఇ.డి.క్రిస్టోఫర్‌ను నియమిస్తూ రాష్ట్ర హోం శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఆయన పదవీ బాధ్యతలు తీసుకున్నారు. స్పెషల్ పీపీగా నియమితులైన క్రిస్టోఫర్‌ను వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ప్రతినిధులు అభినందించారు.

నగరంలో సందడి చేసిన నేహాశెట్టి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): డీజే టిల్లు ఫేమ్, సినీ నటి నేహా శెట్టి గురువారం నగరంలో సందడి చేశారు. గాయత్రి నగర్‌లోని వీఎస్ఎన్ మాల్‌లో 'రాన్' పేరుతో ఏర్పాటు చేసిన వస్త్ర దుకాణాన్ని గురువారం సాయంత్రం ఆమె ప్రారంభించారు. నేహాశెట్టి రాకతో ఆ ప్రాంతంలో యువత కేరింతలో నిండిపోయింది. టిజే టిల్లు సినిమాలో నేహాశెట్టి పాత్ర పేరు అయిన రాధిక అంటూ యువత సందండి చేశారు. డీజే టిల్లు సినిమా పాటలకు నేహా శెట్టి డ్యాన్స్ చేసి యువతకు ఉత్సాహపరిచారు. విజయవాడ అంటే తనకు చాలా ఇష్టమని నేహా శెట్టి చెప్పారు. రాన్ షోరూమ్ అధినేత విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్యాషన్ అంటే ఇష్టపడే వారికి రాన్ స్టోర్ సరైన ఎంపిక అవుతుందన్నారు.

నీటి కుంటలతో అధిక దిగుబడులు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): వ్యవసాయ భూముల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా పంట సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏపీఓ మాధవరెడ్డి తెలిపారు. కేతనకొండలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ఫారమ్ పాండ్(నీటి కుంట)ను గురువారం ఆయన పరిశీలించారు. గతేడాది జూలైలో వర్షం నీటితో నిండిన నీటి కుంటలో ఇప్పటి వరకు నీరు నిలిచి ఉందన్నారు. వేసవిలో సైతం పశువులు, పశువుల కాపర్లు, అడవి వన్యప్రాణులు నీటితో సేదతీరుతున్నాయని ఆయన తెలిపారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే వసతుల కల్పన

- 38వ డివిజన్ కొండ ప్రాంతాల్లో
- గడప గడపకు మన ఆసిఫ్



సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆసిఫ్, భాగ్యలక్ష్మి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కొండ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన వైఎస్సార్ సీపీ చొరవేనని, గతంలో ఎన్నడూ లేని విధంగా కొండ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు వెచ్చించామని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్.ఆసిఫ్ తెలిపారు. పశ్చిమ నియోజక వర్గంలోని 38వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసిఫ్‌తో పాటు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ షేక్.రహమతున్నీసా పాల్గొన్నారు. నాలుగు స్తంభాల సెంటర్ నుంచి ప్రారంభమైన కార్యక్రమం గడప గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రతి కుటుంబం నాలుగైదు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారని చెప్పారు. గడప గడపకు వెళుతున్న తమకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వాలంటీర్ల ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే అందిస్తున్నామని పేర్కొన్నారు. 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

టీడీపీ, జనసేన పార్టీలు పొత్తుల కోసం పాకులాడుతున్నాయే తప్ప, ప్రజా సంక్షేమం గురించి ఆలోచన చేయడం లేదని విమర్శించారు. గతంలో టీడీపీ ప్రజలకు ఏం మేలు చేసిందో చెప్పి రానున్న ఎన్నికల్లో ఓట్లు అడగాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమంతో వైనాట్ 175 అనే నమ్మకంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన అభ్యర్థులను ఎంపిక చేయడం చేశారన్నారు. మూడో సారి కూడా వైఎస్సార్ సీపీ పశ్చిమంలో విజయబావుటా ఎగుర వేస్తుందన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసేందుకు మరో మారు ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. పాదయాత్రలో ప్రజల సమస్యలను విన్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పథకాలను రూపకల్పన చేసి ప్రజల కష్టనష్టాలను తీర్చుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎండీ, ఇర్ఫాన్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, షేక్. హాయాత్ షరీఫ్, బొమ్ము మధు, ఎద్దు. సురేష్, జీ.వినోద్ పాల్, కరిముల్లా, మంటి రాము, రవూఫ్, అనీస్ వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు జరిగే ఉపవాస దీక్ష విరమణ సమయంలో హలీమ్ స్టాల్స్ వద్ద ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి ఆదేశించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ముస్లిం పెద్దలతో గురువారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. చేపల మార్కెట్ సమీపంలోని ఎఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశానికి వెస్ట్ ఏసీపీ విచ్చేసి ప్రసంగించారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే హలీమ్, జ్యూస్ స్టాల్స్ వద్ద ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తపేట సీఐ గణేష్, పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

పక్షుల దాహార్తి తీర్చేందుకు నీటి కుండీలు ఏర్పాటు



లబ్బీపేట(విజయవాడతూర్పు): రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా పక్షుల దాహార్తిని తీర్చేందుకు సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో నీటి కుండీలు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కుండీల్లో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్, అసిస్టెంట్ డైరెక్టర్ సుమైల నీటిని పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి ముగిసే వరకూ కళాశాలలో ఏర్పాటు చేసిన కుండీల్లో నీటిని నింపనున్నట్లు తెలిపారు. పక్షుల కోసం మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలి



మాట్లాడుతున్న డాక్టర్ స్వాతిదేవి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు తమ విద్యార్థుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పాటుపడాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు యూనిసెఫ్ కన్సల్‌టెంట్ వి.స్వాతిదేవి అన్నారు. జేఎన్‌టీయు (కాకినాడ) ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల కోఆర్డినేటర్లకు బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్, ఎల్ఐపీ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని స్థానిక పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతిదేవి మాట్లాడుతూ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు కమ్యూనిటీ సర్వీసెస్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రారణ మిత్ర' యాప్‌లో మాడ్యూల్స్‌ను పీపీటీ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల నుంచి వచ్చిన రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ బి.శివహరిప్రసాద్, డాక్టర్ అబ్దుల్‌నబీ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పి. లక్ష్మణస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: తాడిగడప జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి లక్ష్మీపురంకాలనీలో బండి పిచ్చయ్య ఉంటున్నాడు. అతను విజయవాడలో అధ్యాపకుడిగా పని చేస్తాడు. అతని భార్య డెలివరీ కావడంతో ఆస్పత్రి వెళ్లడానికి పిచ్చయ్య, అతని మేనల్లుడు పోతురాజు రమేష్ బయలుదేరి తాడిగడప జంక్షన్ వద్దకు రాగా, ఎదురుగా వచ్చిన మరో బైక్ వీరిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరూ రోడ్డుపై పడి గాయపడ్డారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నయనానందకరం.. శిడిబండి ఉత్సవం

- శోభాయమానంగా వేడుక
- ఉత్సవానికి పోటెత్తిన అశేష భక్తజనం



శిడిబండి వేడుకకు భారీ ఊరేగింపుగా వస్తున్న భక్తులు

ఉయ్యూరు: వీరమ్మతల్లికి జై అంటూ భక్తజన హరతుల నడుమ శిడిబండి ఊరేగింపు శోభాయమానంగా జరిగింది. ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవంలో ప్రధాన ఘట్టమైన శిడిబండి వేడుక గురువారం నయనానందకరంగా సాగింది. అమ్మవారి తిరునాళ్ల మహోత్సవంలో 11వ రోజు శిడిబండి ఉత్సవం నిర్వహించడం సాంప్రదాయంగా వస్తోంది. అమ్మవారి సాంప్రదాయం ప్రకారం పట్టణంలోని పాత వాటర్ ట్యాంకు బజారులో ప్రత్యేకంగా తయారు చేసిన శిడిబండికి గుమ్మడికాయలు ఏర్పాటు చేసి భక్తులు పసుపు నీరు ఓరబోయడంతో ఊరేగింపు ప్రారంభమైంది. కాలేజీ రోడ్డు, ప్రధాన సెంటరు గుండా సాగిన శిడి బండి ఊరేగింపును వేలాదిగా తరలివచ్చిన భక్తులు శిడిబండికి గుమ్మడికాయలు కట్టి, పసుపు నీరు ఓరబోసి భక్తిపారవశ్యం చెందారు. ఆచారం ప్రకారం ఉయ్యూరు ఎస్సీ కాలనీకి చెందిన ఉయ్యూరు వంశస్తుడు అనుపమ్ బంధువులు, మేళతాళాలు, చలువ కావిళ్లతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. శిడిబండిని ఆలయ ప్రదక్షిణ చేయించి అమ్మవారి ఆలయం ఎదురుగా శిడిబండిని నిలిపి వేడుకను పూర్తి చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ప్రధాన రహదారి, ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. పోలీసులు ముందస్తుగానే భద్రతా, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు తీసుకున్నారు. డీఎస్పీ, సీఐ హబీబ్ బాషా, వీ శ్రీనివాసరావు బందోబస్తును పర్యవేక్షించారు.

ముగిసిన శిలువగిరి మహోత్సవాలు



నందిగామ : క్రైస్తవులు అన్ని విషయాల్లో ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని విజయవాడ మేత్రాసన పీఠాధిపతి రెవరెండ్ డాక్టర్ తెలగతోటి జోసఫ్ రాజారావు సూచించారు. పట్టణ శివారుల్లోని పల్లగిరి కొండపైగల శిలువగిరి మహోత్సవాల్లో గురువారంతో ముగిశాయి.జోసఫ్ రాజారావు సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. ఈ సందర్భంగా వాక్యోపదేశం చేస్తూ, క్రైస్తవం మతం కాదని, పరలోక రాజ్యానికి చేర్చే మార్గమని బోధించారు. క్రీస్తును మంచి మనస్సుతో ఆరాధించాలని సూచించారు. విచారణ గురువు రెవరెండ్ ఎం.ఫిలోమెన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మహోత్సవాలకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

జాతీయ పోటీల్లో రాణించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆలిండియా సివిల్ సర్వీసెస్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యిన ఎస్ఆర్ఆర్ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ జి.లలితను గురువారం కళాశాల వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యాన సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తమ కళాశాల అధ్యాపకురాలు ఆలిండియా సివిల్ సర్వీసెస్ బాడ్మింటన్ పోటీలకు ఎంపిక కావటం ఆనందంగా ఉందన్నారు. జాతీయ పోటీల్లో కూడా మరింత మెరుగైన ప్రదర్శనతో పతకాలు సాధించి కళాశాలకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. లలిత ఈ నెల3వ తేదీ నుంచి 9వ తేదీవరకు ఛండీఘర్‌లో జరగబోవు ఆలిండియా సివిల్ సర్వీసెస్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కళాశాల వ్యాయామ విద్య అధ్యాపకులు మండవ కోటేశ్వరరావు, డి.యుగంధర్ కళాశాల అధ్యాపకులు లలితను సత్కరించారు.

4న ఎస్ఆర్ఆర్‌లో జాబ్ ఫెయిర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన ఈ నెల 4వ తేదీన జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు ప్రముఖ కంపెనీలు కొటక్ మహీంద్ర, ముత్తూట్ ఫైనాన్స్, డామినీర్ ఇంటీరియర్స్, కూరాకు ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పాల్గొని వారికి అవసరమైన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయన్నారు. జాబ్ ఫెయిర్‌లో గ్రాడ్యుయేట్ ట్రైనీ, మార్కెటింగ్ మేనేజర్, రిలేషన్‌షిప్ మేనేజర్, వేర్హౌజ్ అసిస్టెంట్ వంటి పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లమో, ఏదేని డిగ్రీ, బీటెక్, ఎంబీఏ చదివిన వారు పాల్గొనేందుకు అర్హులు అన్నారు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారితో పాటు కోర్సు పూర్తిచేసిన వారు కూడా వారి అర్హత సర్టిఫికెట్లతో హాజరుకావచ్చునన్నారు. ఎంపికయ్యిన అభ్యర్థులకు అదేరోజు నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం కళాశాలలోని జేకేసీ సెంటర్‌లో స్వయంగా కానీ జేకేసీ సమన్వయకర్త జి.విజయదీప్ 9573778554 నంబర్‌లో కానీ సంప్రదించాలని కోరారు.

హిమాలయ ఆప్టికల్స్ ప్రారంభం



బెంజిసర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన హిమాలయ ఆప్టికల్ షోరూమ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): బెంజిసర్కిల్ సమీపంలోని సాయినగర్‌లో ఏర్పాటు చేసిన హిమాలయ ఆప్టికల్స్ షోరూమ్ గురువారం ప్రారంభమైంది. ఈ షోరూమ్‌లో కంటి దృష్టికి అవసరమైన అనేక అత్యుత్తమమైన కళ్ల అద్దాలు, విలాసవంతమైన కళ్లజోళ్లు అందుబాటులో ఉంటాయని హిమాలయ ఆప్టికల్స్ క్లస్టర్ మేనేజర్ సంతోషి శిఖా తెలిపారు. సమకాలీన పోకడలకు అనువైన అద్భుతమైన కళ్ల అద్దాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. విలాసవంతంగా ధరించే స్టయిలిష్ సన్ గ్లాసెస్ నుంచి వైద్యులు సూచించిన ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ వరకూ అన్ని రకాల కళ్ల జోళ్లు స్టోర్‌లో లభిస్తాయని చెప్పారు. ప్రతిష్టాత్మకమైన అనేక బ్రాండ్లను ఖాతాదారుల కోసం అందుబాటులోకి తెస్తున్నామని పేర్కొన్నారు. డిజైన్, సన్ గ్లాసెస్ ఎంతో కళాత్మకంగా తీర్చిదిద్ది ఉంటాయన్నారు. రేబాన్, ఒక్లే, వోగ్, కెరీరా, ఫిలా, ఎంపోరియా ఆర్మని, ఎస్పిరిట్ వంటి 60కి పైగా ప్రఖ్యాత బ్రాండ్ల కళ్లజోళ్లను హిమాలయ అందిస్తుందన్నారు.

ఘనంగా కోదండరాముని విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న ఆసిఫ్, భాగ్యలక్ష్మి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వించిపేట ఆబోతుల వారి వీధిలో పునర్నిర్మాణం చేసిన కోదండరామస్వామి వారి దేవస్థానంలో గురువారం స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవం నిర్వహించారు. దేవదాయ ధర్మదాఖ శాఖ కేటాయించిన నిధులతో పాటుగా దాతలు అందించిన నిధులతో ఆలయాన్ని అత్యంత రమణీయంగా పునర్నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ప్రతిష్టను పురస్కరించుకొని ప్రముఖ ఆగమ పండితులు పరాశరం రంగనాథాచార్యుల ఆధ్వర్యంలో పలు వైదిక కార్యక్రమాలు గురువారం తెల్లవారుజాము నుంచి నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టను పూర్తి చేసిన అనంతరం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ అత్యంత విశేషంగా స్వామి వారి ఆలయ నిర్మాణం చేయటం ఆనందంగా ఉందన్నారు. వించిపేటలో సుమారు శతబ్ద కాలంగా ఈ ఆలయాన్ని స్థానిక ప్రజానీకం నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందించిన చేయూతతో పాటుగా స్థానికుల సాయంతో ఆలయ నిర్మాణం చాలా గొప్పగా ఉందన్నారు. అనంతరం తన వంతుగా ఆలయానికి విరాళాన్ని అందించారు. ఆలయ చైర్మన్ యలకల చలపతిరావు మాట్లాడుతూ అందరి సహకారంతో స్వామి వారి ఆలయ నిర్మాణం గొప్పగా చేశామన్నారు. సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాంత ప్రజానీకానికి అన్నదాన సమారాధన నిర్వహించారు. భారీగా భక్తులు తరలివచ్చారు.

అమర గాయకుల సేవలు సదా స్మరణీయం



మాట్లాడుతున్న రమా సత్యనారాయణ, వేదిక మీద శ్రవంతి కృష్ణ మల్లాది స్వాతి తదితరులు

విజయవాడ కల్చరల్: అమర గాయకుల సంగీత సేవలు సదా స్మరణీయమని విశ్వమాతా చారిటబుల్ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. శ్రవంతి కృష్ణా ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైనర్, తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం అమర గాయకులకు స్వరాజంలి కార్యక్రమం నిర్వహించారు. రమా సత్యరాయణ మాట్లాడుతూ అలనాటి మధుర గాయకులు రాగ, తాళ, యుక్తంగా గానం చేసి అభిమానులను రంజిపజేసే వారన్నారు. శ్రవంతి కృష్ణ మాట్లాడుతూ నాటి గాయనీ గాయకుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు గాయకుల కృషిని అభినందించారు. మల్లాది స్వాతి మీరాకుమార్, బీర్ సుషీల్‌కుమార్, భారతి, శ్రీనివాసరావు, కేఎస్ఎన్ మూర్తి, ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, భానుమతి తదితరులు గానం చేసిన సినీ గీతాలను ఆలపించారు. గాయకుడు కేఎస్ఎన్ మూర్తిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

పెనమలూరు: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు అన్నారు. పోరంకిలో గురువారం హ్యాపీ మైండ్స్ ట్రెనింగ్ సెంటర్‌లో జిల్లా ఉపాధి కల్పన శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ వారు సంయుక్తంగా మినీ జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా విక్టర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. జాబ్‌మేళాలో 31 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతలో నైపుణ్యం పెంపొందించే విధంగా అనేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కోసం ప్రముఖ కంపెనీలను సంప్రదించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం పలువురికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నియామక అధికారి తుర్లపాటి మధు, కోఆర్డినేటర్ ఎం.శంకర్, కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌కు సత్కారం



వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్‌ను సత్కరిస్తున్న జీడీఏ ఏపీ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించినందుకుగాను గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (జీడీఏ ఏపీ) ఆధ్వర్యంలో సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్‌ను సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కొణిదెల రవి, డాక్టర్ వాసిరెడ్డి అరుణ, జనరల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఇంజేటి బాబ్జి శ్యామ్‌కుమార్ తదితరులు ప్రిన్సిపాల్ చాంబర్‌కు వెళ్లి డాక్టర్ సుధాకర్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కళాశాలలోని అన్ని విభాగాలకు బోధనా పరంగా అవసరమైన కంప్యూటర్లు, ఎల్సీడీ ప్రొజెక్టర్లు, రైటింగ్ బోర్డులు, స్టేషనరీని సమకూర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ రజని, డాక్టర్ రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి నుంచి ఎంపీగా పోటీ చేస్తా

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రత్యేక హోదా అంశంపై పోరాడటానికి తమ పార్టీ తరపున తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తాను ఎన్నికల్లో పోటీ చేస్తానని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, జి.విజయ్‌కుమార్ చెప్పారు. నగరంలో హోటల్‌లో ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అన్ని పార్టీలు ప్రజలకు మేము అధికారంలోకి వస్తే ఇది చేస్తామంటూ మ్యానిఫెస్టోలు ప్రకటిస్తున్నాయే కానీ, ప్రజలకు ఏమి కావాలనే విషయాన్ని వారిని అడగడం లేదన్నారు. లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ, జై భారత్ నేషనల్ పార్టీ లాంటి వాటితో కలిసి రాష్ట్రంలో మూడో ప్రత్యమ్నాయాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్నికల సీట్ల కేటాయింపులో తమ పార్టీలో యువతకు అధిక ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. తాను రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు స్వయంగా వెళ్లి ప్రజలతో మాట్లాడుతూ వారు ప్రభుత్వం నుంచి ఏమి ఆశిస్తున్నారో తెలుకుంటున్నానని తెలిపారు. ఉద్యోగాలు, మహిళలకు రక్షణ, రుణాలు యువత కోరుకుంటున్నారని చెప్పారు.

నెమలి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై 5న సమావేశం

తిరువూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానంలో మార్చి 23వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై మార్చి 5వ తేదీన సమావేశం జరపనున్నట్లు తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధవి గురువారం తెలిపారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేపట్టే ఏర్పాట్లపై సమీక్షిస్తామన్నారు. 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి రెవెన్యూ, పోలీస్, రవాణా, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

• కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గురువారం జరిగింది. అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి, పథకాలు వివరించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు, మాతృ వందనం, పీఎం ఉజ్వల యోజన, సమ్మాన్ కిసాన్ యోజన తదితర పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, మున్సిపాలిటీ అధికారులున్నారు.